క్లుప్తంగా

అమ్మవార్లకు పానకం కావిళ్లు



అంగరలో అమ్మవారికి సంబరం నిర్వహిస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: ఆషాఢమాసం ముగింపు సందర్భంగా అంగర గ్రామ దేవతలకు ఆదివారం చలివిడి, పానకాలు సమర్పించారు. అశిరాంబిక, కనకదుర్గమ్మ, రాజ్యలక్ష్మి, ఆదిలక్ష్మి, పోలేరమ్మ అమ్మవార్లకు గ్రామవీధుల్లో ఊరేగిస్తూ కావిళ్లతో నైవేద్యాలను సమర్పించారు. అంగర, పడమర ఖండ్రిక, గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేటి నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

కపిలేశ్వరపురం: పంచాయతీ కార్యకలాపాలపై సోమవారం నుంచి 14 వరకూ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కొండలరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు మూడు రోజుల పాటు పారిశుధ్య కార్యక్రమాలు, సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ షెడ్లు నిర్వహణ, ఎల్ఈడీ బల్బులు అమర్చడం తదితర కార్యకలాపాలపై శిక్షణ ఇస్తామన్నారు. పంచాయతీ పరిపాలనలో పారదర్శకత, నాణ్యతలను మెరుగుపర్చేందుకు శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని ఎంపీడీఓ కొండలరావు తెలిపారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్లను రెగ్యులర్ చేయాలి



ఎంఈవో కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ల సమావేశం

రామచంద్రపురం: విద్యా శాఖలో సుమారుగా 21 సంవత్సరాలుగా సేవలందిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో విద్యాశాఖలో పని చేస్తున్న ఉమ్మడి జిల్లా డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమావేశం రామచంద్రపురం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆదివారం జరిగింది. గతంలో సమ్మె చేసిన కాలానికి జీతాలు చెల్లించాలని, ఎంటీఎస్ అమలు చేయాలని కోరారు. చిరుద్యోగులపై వేధింపుల నివారణకు ఉన్నతస్థాయి కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులకు సంబంధించి అగ్రిమెంట్ బాండులో షరతులు నిరంకుశంగా ఉన్నాయని, ఎటువంటి కారణం లేకుండా తొలగించడం వంటివి వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, కె.శ్రీనివాస్, బి.జాన్ బాబు, ఎస్.సర్వేశ్వరరావు, కె.నాగమణి, అనంతలక్ష్మి, తులసి, కె.వీరపండు తదితరులు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై వేధింపులకు పాల్పడితే ఉద్యమం

కపిలేశ్వరపురం: రాష్ట్రంలో చిరుద్యోగులపై జరుగుతున్న దాడులను సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి ఆదివారం ఖండించారు. పరిమిత జీతాలతో ప్రభుత్వ సేవలను అందిస్తున్న చిరుద్యోగులను ప్రశంసించాల్సిన ప్రభుత్వ, రాజకీయ ప్రతినిధులు అందుకు భిన్నంగా ప్రవర్తించడాన్ని తప్పుబట్టారు. ప్రజాపాలన అందించాల్సిన పాలకులు వేధింపులకు పాల్పడితే క్షేత్ర స్థాయిలో ఉద్యమిస్తామని కృష్ణవేణి అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: కాకినాడ-కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం ఆర్యావటం వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం ...కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన వక్కలపూడి సత్యప్రసాద్ తన మోటారు బైక్‌పై దాక్షరామ వెళ్లి తిరిగి వస్తున్నారు. ఆర్యావటం వాటర్ ట్యాంక్ వద్దకు వచ్చేసరికి రోడ్డుపై నడచి వెళ్లుతున్న ఒక వ్యక్తి అడ్డుగా రావటంతో ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. బైక్ పల్టీలు కొట్టడంతో సత్యప్రసాద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

18న జాతీయ శతాధిక కవి సమ్మేళనం

సఖినేటిపల్లి: ఈ నెల 18వ తేదీన అమలాపురంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో 138వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆదివారం తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక, టూరిజం, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా జాతీయ శతాధిక కవి సమ్మేళనం, తెలుగు భాషా సంబరాలపై బ్రోచర్ ఆవిష్కరించారు. ప్రతాప్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలుగు భాషా దినోత్సవ సంబరాల్లో భాగంగా పై కవి సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. తెలుగు భాష, తెలుగు సంస్కృతి, తెలుగు వైభవంపై ఈ కవి సమ్మేళనం ఉంటుందన్నారు.

మలుపు.. ప్రమాదాలకు పిలుపు



కె.గంగవరం మండలం యర్రపోతవరం- వేగాయమ్మపేట వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు



రామచంద్రపురం మండలం ఓదూరు వద్ద ఎస్ ఆకారంలో మలుపు



రామచంద్రపురం బైపాస్ రోడ్డులో పసలపూడి వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

- గ్రామాల్లో ప్రమాదకరంగా మలుపులు
- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

రామచంద్రపురం: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మలుపులు ప్రమాదకరంగా మారాయి. పలు గ్రామాల్లో ఎస్, ఎల్, యూ ఆకారాల్లో మలుపులు ఉన్నాయి. ఆయా మలుపుల్లో తరచూ ప్రమాదాలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు. తాజాగా రెండు రోజులు క్రితం యర్రపోతవరంలోని ఓ యువకుడు ప్రమాదకరమైన జంక్షన్ వద్ద బలయ్యాడు. నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల్లో ప్రమాదకరమైన మలుపులు, జంక్షన్లు ప్రయాణికులను హడలెత్తిస్తున్నాయి.

పట్టణంలో..

పట్టణానికి సమీపంలో నుంచి వేసిన బైపాస్ రోడ్డులో పసలపూడి వద్ద కాకినాడ-మండపేట-రామచంద్రపురం వెళ్ళే ప్రధానమైన జంక్షన్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత పదేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. పసలపూడి బైపాస్ రోడ్డు వై జంక్షన్ వద్ద రాత్రివేళల్లో ఏ వాహనం ఎటువైపునకు వెళుతుందో తెలియక వాహనదారులు తికమక పడుతూ ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక్కడ ఇటీవల జరిగిన ప్రమాదాల్లో పలువురు గాయాలపాలయ్యారు.

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలోని మూడు మండలాల్లోనూ ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. రామచంద్రపురం మండలంలోని కాకినాడ రహదారిలో ఓదూరు వద్ద గల ఎస్ ఆకారంలో ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇదే ప్రదేశంలో ఏడాదికి ఐదు నుంచి ఆరు వరకు పెద్ద ప్రమాదాలు సంభవించి పలువురు మృత్యువాత పడుతున్నారు. ఇక్కడ గల ఎస్ ఆకారం టర్నింగ్‌లో వాహనాలు సైతం సమీపంలోని ఇళ్లలోకి దూసుకుపోతున్నాయి. ఇదే మార్గంలో ఓదూరు దాటిన తరువాత నరసాపురపుపేట రోడ్డులో మరో ఎస్ ఆకారం మలుపు ఉంది. ఇక్కడ ఏకంగా కార్లు, బస్సులో పక్కనే గల పంట పొలాల్లోకి దూసుకుపోతున్నాయి. ఆయా ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడటంతో పాటు అనేక మంది గాయాలపాలవుతున్నారు.

కె.గంగవరం: మండల పరిధిలోని యానాం- ద్రాక్షారామ రోడ్డులో వేగాయమ్మపేట- యర్రపోతవరం వద్ద ఇంజరం కెనాల్‌ను ఆనుకుని ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. గతంతో ఇక్కడ ఓ జంటను లారీ ఢీకొట్టడంతో ముత్యువాత పడ్డారు. అలాగే కె.గంగవరం- అంగర ప్రధాన రహదారిలో తామరపల్లి, సత్యవాడ, గ్రామాల్లోని మలుపుల్లో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

కాజులూరు: మండలంలోని కాకినాడ- కోటిపల్లి ప్రధాన రహదారుల్లో పలు చోట్ల ఉన్న జంక్షన్లు ప్రమాదకరంగా మారాయి. జగన్నాథగిరి, ఆర్యావటం వద్ద గల మలుపు కూడా ప్రమాదాలకు నిలయంగానే మారింది. ఈ రోడ్డులో నిత్యం ఇసుక లారీలు, బస్సులు తిరగటంతో ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రమాదాలు జరుగుతున్న మలుపులు వద్ద ప్రమాదాలను శాశ్వతంగా నివారలించాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్ ఆకారంలో టర్నింగ్‌లు ఉన్న చోట ఆక్రమణలు తొలగించి రోడ్డును వెడల్పు చేయాల్సి ఉంది. కాగా వేగాయమ్మపేట, యర్రపోతవరం వద్ద గల మలుపులోని కల్వర్టును వెడల్పు చేస్తున్నట్లు అప్పట్లో అధికారులు ప్రకటించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.

మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు



ద్రాక్షారామ నుంచి యానాం వరకు గ్రామాల్లో ఉన్న మలుపుల వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటు కాలువ గట్టు రోడ్డు పూర్తిగా ఛిద్రమై ప్రమాదకరంగా మారింది. గ్రామాల్లోని మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడు బేకర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గుతాయి. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– కదలి విజయదుర్గ, పేకేరు, కె.గంగవరం మండలం

డివైడర్లు ఏర్పాటు చేయాలి



పసలపూడి బైపాస్ రోడ్డు వై జంక్షన్ చాలా ప్రమాదకరంగా మారింది. ఎదురుగా వచ్చే వాహనాలు ఎటు వైపు వెళతాయో తెలియక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వై జంక్షన్ వద్ద మధ్యక్షలు–కాకినాడ, మండపేట రోడ్ల మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు తగ్గుతాయి. వాహనదారులకు మార్గం సుగమం అవుతుంది. అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నాం.

– తొగరు మూర్తి, వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు, రామచంద్రపురం

లారీ ఇంటిలోకి దూసుకుపోయింది



మా గ్రామంలో రోడ్డు మలుపు ప్రమాదకరంగా ఉంది. ఈ మలుపు వద్ద ఉన్న ఇంటిలోకి గతంలో లారీ దూసుకుపోయింది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు మలుపు వద్ద స్పీడుగా వెళ్లే అవకాశం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

– వినకోటి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ, రామచంద్రపురం మండలం

కుంగ్-ఫూ, కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

మండపేట: జాతీయ స్థాయి కుంగ్-ఫూ, కరాటే పోటీల్లో మండపేట విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం సాయి సెల్ఫ్ డిఫెన్స్ మెటీరియల్ ఆర్ట్స్ మాస్టర్స్ టీమ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంగ్-ఫూ, కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి వందలాది మంది మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో భాగంగా మండపేట నుంచి న్యూ డ్రాగన్ చైనీస్ కుంగ్-ఫూ గ్రాండ్ మాస్టర్ పిట్టా రాజబాబు వద్ద శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటారు. రాజబాబు తెలిపిన వివరాల మేరకు బ్రౌన్ స్పారింగ్ విభాగంలో దొరనవ్య మొదటి బహుమతి గెలుచుకుందని చెప్పారు. ఆరెంజ్ బెల్టుకు సంబంధించి గడి సర్విక్‌రామ్ మొదటి స్థానంలోను, ముక్కా యశ్వంత్, గవర సిద్ధు ద్వితీయ స్థానాల్లో బహుమతులు గెలుచుకున్నారన్నారు. అలాగే యెల్లో బెల్టు విభాగంలో రండి చక్రి మొదటి స్థానం, ఊడి ఈశ్వర్ ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారని రాజబాబు తెలిపారు.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి



కామన ప్రభాకరరావు

మండపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రెండు నెలలు గడుస్తున్నా రైతు సమస్యలు పట్టించుకోకపోవడం శోచనీయమని డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. మండపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై మండి పడ్డారు. 5 నెలల క్రితం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం సొమ్ములు నేటికీ ఇంకా విడుదల చేయకపోవడంతో రైతులు, కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కౌలు రైతులు అప్పులు చేసి పంటను పండించారన్నారు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి సతమతమవుతుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి నాయకులు రైతులకు ధాన్యం బకాయిలు చెల్లించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఇంకో పక్క రైతులు నాట్లు వేసుకుని ఉండగా భారీ వర్షాలు రైతుల కొంప ముంచాయన్నారు. దెబ్బతిన్న నారుమడులకు ఇప్పటివరకూ ఏవిధమైన సహాయం అందించలేదన్నారు. తక్షణం దీనిపై స్పందించి దెబ్బతిన్న నాట్లకు నష్టపరిహారం, అమ్మిన ధాన్యానికి సొమ్ములు వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ తరపున కామన డిమాండ్ చేశారు.


లక్ష్మీనృసింహునికి జన్మ నక్షత్ర పూజలు



అంతర్వేది ఆలయంలో స్వాతి నక్షత్ర పూజలు చేస్తున్న అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని ఆదివారం స్వామివారికి అర్చకులు అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పి.రామశేషాచార్యులు ఈ పూజలు నిర్వహించారు. తొలుత వశిష్ఠ గోదావరి నది నుంచి కలశలతో తెచ్చిన పవిత్ర జలాలకు వేద మంత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం 108 కలశలలో ఉంచిన జలాలల్లోకి స్వామివారి మూల మంత్రంతో ఆవాహనం చేసి అర్చన చేశారు. అలాగే సర్వదేవతలను కలశల్లోకి ఆవాహనం చేసి విశేష పూజలు నిర్వహించారు. వీటితో పాటు పంచామృతాలతో, వేద మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి విశేష అభిషేకం, పూజలు చేశారు. అలాగే ఆలయంలో ఎంతో ప్రాశస్త్యం కలిగిన నారసింహ సుదర్శన హోమంలోను భక్తులు పాల్గొన్నారు. కాగా స్వామిని ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనాల ద్వారా 4 వేల మంది భక్తులు దర్శించుకున్నట్టు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ చెప్పారు. ఆలయంలో నిర్వహించిన విశేష కార్యక్రమాలన్నింటికీ విచ్చేసిన భక్తులకు అన్నదాన పథకంలో భోజన వసతి ఏర్పాటు చేశామని ఆయన అన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలు వీరే...



టోర్నమెంట్ విజేతలతో క్లబ్ సభ్యులు

మలికిపురం: స్థానిక శ్రీరామ బ్యాడ్మింటన్ అకాడమీ సౌజన్యంతో ఫ్రెండ్స్ షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో మలికిపురం డిగ్రీ కాలేజ్ ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన షటిల్ టోర్నమెంట్ గత రెండు రోజులుగా జరుగుతున్నాయి. వివిధ టీంలు తలపడగా ఆదివారంతో పోటీలు ముగిశాయి. టోర్నమెంట్‌లో సీనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా పెద్దిరాజు, అండ్ బాలు టీం రన్నర్స్‌గా పి.కృష్ణచైతన్య-బి.వీరబాబు టీంలు నిలిచాయి. జూనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా ఎస్.విశాల్ రాజు-వై.నాగబాబు టీం, రన్నర్స్‌గా ఆర్.వేణు-బి.ప్రశాంత్‌లు గెలుపొందారు. ఈ టోర్నమెంట్‌కి చీఫ్ రిఫరీ మహ్మద్ జానీ ఇంతాల్, కోచ్ కె.హరికృష్ణ వ్యవహరించగా క్రీడాకారులను దెందుకూరి రాంబాబురాజు, ప్రముఖ షటిల్ క్రీడాకారుడు పెదపాటి జాన్ విలియమ్స్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్లబ్ సభ్యులు గెద్దాడ నాగేశ్వరరావు, కృష్ణ చైతన్యమణి, నేతికొండ అంజి, శివకుమార్, పెదబాబు, సాయిరాం, పవన్, చందు, స్టాలిన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఆదివారపుపేట చేనేత పరికరాల పంపిణీలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం (ఎన్‌హెచ్‌డీపీ) పథకం ద్వారా మండలంలోని ఆదివారపుపేట గ్రామానికి మంజూరైన వర్కు షెడ్‌ల ప్రారంభోత్సవం, పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆదివారం మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నక్కిన దొరబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి చేనేత రంగానికి రావాల్సిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలపై సీఎంతో మాట్లాడతానన్నారు. జిల్లా చేనేత జౌళిశాఖ అధికారి, రామచంద్రపురం మండల ప్రత్యేక అధికారి ఎం.నారాయణరాజు మాట్లాడుతూ ఆదివారపుపేట గ్రామానికి ఎన్‌హెచ్‌డీపీ పథకంలో భాగంగా మొదటి విడత 104 మంది లబ్ధిదారులకు రూ.52.80 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవాని, గ్రామ ఎంపీటీసీ బళ్ల సుధాకరరావు, జౌళి శాఖ సహాయ అభివృద్ధి అప్పారి వెంకటేశ్వరరావు, డిజైనర్ మోహన్, క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ శ్రీకాంత్, ఆదివారపుపేట శివబాలయోగి సొసైటీ సెక్రటరీ అన్నవరం, కలకండ రామలింగేశ్వరరావు గురుజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి



ద్రాక్షారామలో జాతీయ జెండాలతో బీజేపీ నాయకులు

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలో ప్రతీ ఇంటిపై, ప్రతి కార్యాలయంపైనా ఈ నెల 13 నుంచి 15 వరకు జాతీయ జెండా ఎగురవేయాలని నియోజకవర్గ హర్ ఘర్ తిరంగా కార్యక్రమ ఇన్‌చార్జి ఎస్. సాయిరాం కోరారు. బీజేపీ రామచంద్రపురం మండల సమావేశం పార్టీ మండలాధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ద్రాక్షారామలో జరిగింది. ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 14న నిర్వహించే మౌన ర్యాలీని కూడా విజయవంతం చేయాలన్నారు. భారతీయ జనతా యువ మోర్చా మండల అధ్యక్షుడు తోలేటి సూర్యగంగాధర్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో మండలాల అధ్యక్షులు సలాది వీరబాబు, అవసరాల రమణమూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యుడు పెయ్యల రాంబాబు, యాండ్ర బుల్లబ్బులు, దొంతంశెట్టి ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఎల్ఐసీ ప్రముఖులు



అంతర్వేది ఆలయంలో ఎల్ఐసీ ప్రముఖులకు స్వామి చిత్రపటం ఇస్తున్న ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం సౌత్ సెంట్రల్ జోనల్ మేనేజర్ (ఎల్ఐసీ) పునీత్ కుమార్, రీజినల్ మేనేజర్ ఉతుప్ జోసెఫ్, ఎస్‌డీఎం సంధ్యారాణి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకుడు పి.రామశేషాచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



అంతర్వేది ఆలయంలో స్వామి చిత్రపటం అందుకుంటున్న యమున

అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు మలికిపురం భూపతివారి పేటకు చెందిన గుబ్బల శేఖర్‌బాబు, యమున దంపతులు రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయంలో ఆలయ సిబ్బందికి పై మొత్తాన్ని ఇచ్చి, స్వామివారి చిత్ర పటం, ప్రసాదంను ఆమె అందుకున్నారు.

బాలోత్సవాలతో బాలల్లో ప్రతిభ బహిర్గతం

కొత్తపేట: ప్రాథమిక స్థాయి నుంచీ బాలలతో బాలోత్సవాలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో ఉన్న ప్రతిభను బహిర్గతం చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కోనసీమ బాలోత్సవం మొదటి పిల్లల పండగ పేరిట రెండు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. మనం ట్రస్ట్, జితేంద్ర సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండోరోజు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పిల్లలు వీడియో గేమ్‌లు, సెల్‌ఫోన్లకు బానిసలవుతున్న తరుణంలో బాలోత్సవం పేరిట ఇటువంటి సాంస్కృతిక, అకడమిక్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా వారిలో శారీరకంగా, మానసికంగా ఉల్లాసపరచడమే కాకుండా మేధాశక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. బాలోత్సవం నిర్వాహకులు జితేంద్ర సేవా ఫౌండేషన్ చైర్మన్ మట్టపర్తి జితేంద్ర కుమార్, కోనసీమ బాలోత్సవ అధ్యక్షుడు కాశీ విశ్వనాథం, మనం ట్రస్ట్ ఇన్‌చార్జి యెండూరి పవన్, మనం ట్రస్ట్ చైర్మన్ కె.వీరబాబు అభినందించారు. అకడమిక్ విభాగంలో సుమారు 50 ఈవెంట్స్, సాంస్కృతిక విభాగంలో 16 పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే సత్యానందరావు, ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్‌వుడయార్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



శేరిలంకలో బాధితులకు నిత్యావసర సరకులు అందిస్తున్న టీడీఆర్ ట్రస్ట్ సభ్యులు

కె.గంగవరం: మండలంలోని శేరిలంకలో వరద బాధిత కుటుంబాలకు ఆదివారం దాతలు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఇటీవల సంభవించిన వరదలు కారణంగా ఇబ్బందులు పడిన సుమారు 300 కుటుంబాలకు టీడీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ తాతాపూడి డానియేల్ రాజు నిత్యావసర సరకులు, షెల్టర్ కిట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. గత నాలుగేళ్లలో టీడీఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ప్రోగ్రామ్ మేనేజర్స్ గుత్తాల మాధురి, కూరాటి చిన్న తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



గొల్లపాలెంలో ఉపసర్పంచ్ భువనేశ్వరీదేవి ఇంటి వద్ద విరబూసిన బ్రహ్మకమలం

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో ఆదివారం బ్రహ్మకమలాలు విరబూశాయి. వైఎస్సార్ సీపీ మండల మహిళా కార్యదర్శి, గొల్లపాలెం ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి ఇంటి ఆవరణలో రెండు బహ్మకమలాల మొక్కలు విరబూశాయి. స్థానికులు వీటిని ఆసక్తిగా తిలకించారు.

గుర్తింపు కార్డులు రెన్యువల్ చేయించుకోవాలి

అంబాజీపేట: భవన నిర్మాణ రంగ కార్మికులు తమ గుర్తింపు కార్డులను రెన్యువల్ చేయించుకోవాలని ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గల్లా రాము తెలిపారు. గంగలకుర్రులో రావులమ్మ తల్లి తాపీ పనివార్ల కార్మిక సంఘం ఆధ్వర్యంలో రామును ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్మిక సంఘ అధ్యక్షుడు బొరుసు కృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాము మాట్లాడుతూ కొత్తగా చేరిన కార్మికులు నూతన కార్డులకు కొత్తపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికులకు నిరంతరం వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నందుకుగాను రామును సన్మానించినట్లు సంఘ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు చిరతపూడి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కుడుపూడి రమేష్, సహాయ కార్యదర్శి జయను వెంకటరమణ, ఊటాల రమేష్, చొల్లంగి పల్లంశెట్టి, మట్టపర్తి రామకృష్ణ, పలివెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యాయ సలహాతో సమస్య నుంచి విముక్తి

రావులపాలెం: సమస్యలతో సతమతమవుతున్న వారికి సకాలంలో న్యాయ సలహా అందడం ద్వారా సమస్య నుంచి విముక్తి లభించే అవకాశాలున్నాయని విమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్, న్యాయవాది బూసి ప్రసన్న అన్నారు. విమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, అప్నా అంజుమన్ ఈఫలహే మిల్లత్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రావులపాలెం బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలోని మసీదు ఆవరణలో ఉచిత న్యాయ సలహాల కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాది ప్రసన్న మాట్లాడుతూ రోజువారీ జీవితంలో తలెత్తుతున్న పరిస్థితులను అర్థం చేసుకోవడంతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్ట పరిధిలో సమాచారాన్ని పొందే హక్కు అందరికీ ఉందన్నారు. సమస్యలకు గురైన పేదలకు తాము న్యాయపరంగా అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ట్రస్ట్ కార్యదర్శి ముప్పిరి వెర్రియ్య, అప్నా అంజుమన్ ఇ ఫలహే మిల్లత్ కమిటీ అధ్యక్షుడు బాషా మాట్లాడుతూ సామాన్య ప్రజలకు అండగా నిలిచేందుకు తమ కార్యకలాపాలను విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జహంగీర్, రహ్మతుల్లా, షరీఫ్ వలియుల్లాహ్ మాట్లాడారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.